క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



వధువరులను ఆశీర్వదిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, నూతన వధువరులైన ఖాదర్‌వల్లి, నూర్ ఏ చష్మిల వివాహం గురువారం మొయిళ్లకాల్వ గ్రామంలో జరిగింది. ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డిలు హాజరై వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి

వీరపునాయునిపల్లె : మండలంలోని యరమలపల్లె సర్పంచ్ సౌజన్యకుమార్‌రెడ్డిపై గురువారం ఉపాధి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాడికి పాల్పడ్డారు. వివరాలలోకి వెళితే.. సర్పంచ్ సౌజన్యకుమార్‌రెడ్డి తమ గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని ఏపీఓ లక్ష్మీనారాయణరెడ్డితో మాట్లాడుతుండగా యరమలపల్లె గ్రామానికి చెందిన ధనుంజయ్‌రెడ్డి, మణీకంఠారెడ్డి మరి కొందరు టీడీపీ నాయకులు మస్టర్లు, రికార్డులతో నీకేమి పనిరా అంటూ సౌజన్యకుమార్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. సౌజన్యకుమార్‌రెడ్డి ఫిర్యాదుతో ఎస్ఐ మంజునాథ కేసు నమోదు చేశారు. దీనిపై ఏపీఓ వివరణ కోరగా సర్పంచు సౌజన్యకుమార్‌రెడ్డి తమ గ్రామంలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని నా దృష్టికి తీసుకురావడంతో పాటు మస్టర్లను చూపించమని అడిగారు.

బండలాగుడు పోటీల విజేతలు వీరే

సింహాద్రిపురం : అంకాలమ్మగూడూరులో అంకాలమ్మ అమ్మవారి తిరునాల సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలలో నంద్యాల జిల్లాకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు రూ.80వేలు, అక్కంపల్లెకు చెందిన ఇంద్రరెడ్డి ఎద్దులు రూ.70వేలు, బాపట్ల జిల్లాకు చెందిన లక్ష్మీరెడ్డి ఎద్దులు రూ.60వేలు, కడపకు చెందిన వెంకట్రామిరెడ్డి ఎద్దులు రూ.50వేలు, నంద్యాల జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు రూ.40వేలు, కడప జిల్లాకు చెందిన కొండా సురేఖ ఎద్దులు రూ.30వేలు, కడప జిల్లాకు చెందిన మధుసూదన్‌రెడ్డి ఎద్దులు రూ.20వేలు, అనంతపురం జిల్లాకు చెందిన రాజశేఖరరెడ్డి ఎద్దులు రూ.10వేల నగదు బహుమతులను అందుకున్నారు.

సబ్సిడీతో విత్తనాలు

లింగాల : మండల వ్యాప్తంగా వేసవిలో బోర్ల కింద వేరుశనగ, మినుము పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ, మినుము విత్తనాలు అందిస్తోందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. గురువారం లింగాల రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 30 కేజీల వేరుశనగ బస్తా పూర్తి ధర రూ.2880 కాగా, 50 శాతం సబ్సిడీ పోను రైతు ఒక బస్తాకు రూ.1440 చెల్లించాల్సి ఉంటుందని, అలాగే మినుములు పూర్తి ధర ఒక కేజీకి రూ.140 కాగా, సబ్సిడీపోనూ రూ.70 కట్టాలన్నారు.

చిన్నవెంతుర్ల దళితవాడలో నీటికి కటకట..

- రెండు నెలలుగా కుళాయిలకు నీరు రాని వైనం
- దళితుల నిరసనతో దిగివచ్చిన అధికారగణం

మైలవరం : చిన్నవెంతుర్ల దళితవాడ గత రెండు నెలలుగా దాహంతో అల్లాడుతోంది. ఎస్సీ కాలనీ కుళాయిలకు బొత్తిగా నీరు రాకపోవడంతో సమస్య జటిలమై దళితులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. తమ సమస్యను గ్రామ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, సచివాలయ ఉద్యోగులకు, మండలస్థాయి అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదని వారు వాపోతున్నారు.

అసలు సమస్య ఇదీ..

మైలవరం మండలం చిన్నవెంతుర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ తరుపున రెండు బోర్లు పనిచేస్తున్నాయి. ఈ నీరంతా ఓసీ కాలనీ, బీసీ కాలనీలకు పూర్తిగా అందిన తరువాత ఎస్సీ కాలనీలోని కుళాయిలకు రావలసి ఉంది. కానీ వేసవి రావడంతో రెండు బోర్లలోని నీరంతా ఓసీ, బీసీల ప్రజలకు మాత్రమే సరిపోతుంది. గ్రామ పంచాయతీ నీరు ఎస్సీ కాలనీ వరకు రావడం లేదు. దీంతో ఎస్సీలపైనే ఎందుకీ వివక్ష అంటూ వారు మండిపడుతున్నారు. దీంతో దళిత మహిళలు గురువారం ఉదయం ఖాళీ బిందెలను బజార్‌లో ఉంచి పెద్ద ఎత్తున తమ నిరసనను వ్యక్తం చేయడంతో సాయంత్రానికి అధికారులు దళితవాడకు చేరుకుని సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మాపై ఎందుకీ వివక్ష



రెండు నెలల నుంచి దళిత కాలనీలో ఏ ఒక్క కుళాయికి కూడా నీరు రావడం లేదు. మేము బిందెలను తీసుకెళ్లి బీసీ కాలనీ, ఓసీ కాలనీలోకి వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తుంది. కొన్నిసార్లు వారు అనుమతిస్తున్నారు. ఇంకొన్నిసార్లు తమకే నీరు చాలడం లేదంటూ మమ్మల్ని వెనక్కి పంపుతున్నారు. మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– కోటా శిరోమణి, చిన్నవెంతుర్ల, మైలవరం మండలం

ఎస్సీలమని మాపై చిన్న చూపా



దళితులమైన మా పట్ల అధికారులు చిన్న చూపుతో వ్యవహరిస్తున్నారు. ఇదే సమస్య ఓసీలకు, బీసీలకు వస్తే నిమిషాల్లో పరిష్కారం చేసేవారు. కానీ మాకు నెలలు తరబడి నీళ్లు రాకుండా పట్టించుకునే నాథుడు లేడు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– మలగిరి పుష్పావతి, చిన్నవెంతుర్ల, మైలవరం మండలం

గ్రామంలోకి వెళ్లి పరిశీలించాం

చిన్నవెంతుర్ల గ్రామంలో నీటి సమస్య ఉందని తెలియడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి సమస్యను పరిశీలించాము. ప్రస్తుతం అక్కడ రెండు బోర్లు ఉన్నాయి. కాలనీ కొంత ఎత్తు పల్లాలు కావడంతో నీటి సరఫార కొంత సమస్య ఉన్నట్లు గుర్తించాము. బోరు కనెక్షన్ డైరెక్ట్‌గా ఇస్తే బాగుంటుందని చూస్తున్నాం.

– వై.రామచంద్రారెడ్డి ఎంపీడీఓ, మైలవరం

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించండి

వేంపల్లె : పట్టణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపాన్ని తెరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషన్‌రెడ్డితో కలసి తిరుపతిలో టీటీడీ పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ 1998లో వేంపల్లెలో పేద ప్రజల వివాహాది శుభా కార్యాలు నిర్వహించుకునేందుకు వీలుగా టీటీడీ వారి నిధులతో కల్యాణ మండపాన్ని నిర్మించారన్నారు. గత వైకాపా ప్రభుత్వం 2020 నుండి పునర్నిర్మాణం పేరుతో పనులు ప్రారంభించి ఇంతవరకు 90 శాతం పనులు పూర్తి చేశారని, మిగిలిన 10 శాతం పనులకు నిధులు కేటాయించి కల్యాణ మండపాన్ని ప్రారంభించేలా చూడాలన్నారు. గండి క్షేత్రానికి సంబంధించి టీటీడీ వారి అదీనంలో ఉన్న 1.171 కేజీల బంగారం మరియు 65 కేజిల వెండిని ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. అలాగే గండి క్షేత్రంలో స్వామి వారి ప్రసాదం తయారు చేయుటకు లడ్డు పోటుకు కావాల్సిన నిధులు మంజూరు చేయించాలని కోరామన్నారు. త్వరలో జరిగే పాలక మండలి సమావేశంలో చర్చించి కల్యాణ మండపం ప్రారంభంతోపాటు గండికి రావాల్సినవన్నీ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో గురువారం విశ్రాంత అధ్యాపకులు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తల్లి దివంగత సారెడ్డి నారాయణమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మానవతా సంస్థ చైర్మన్ కొండారెడ్డి, సభ్యులు నారాయణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా తన తల్లి నారాయణమ్మ స్మారకార్థం అనాథలకు, వికలాంగులకు సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, మానవతాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సారెడ్డి చంద్రశేఖరరెడ్డి

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలి

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ, వెలుగు, వ్యవసాయ సిబ్బందికి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఓ హాజరై మాట్లాడుతూ రసాయనాలు, పురుగు మందులు విచ్చలవిడిగా వాడటం ద్వారా వాతావరణం కలుషితమై మనం తీసుకుంటున్న నీరు, గాలి చెడిపోయాయని, వాటితో మన ఆరోగ్యాలు దెబ్బతినిపోవడం, క్యాన్సర్, గుండె జబ్బులు, గర్భకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఏపీఎం గురురాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి కిచెన్ గార్డెన్స్ వేసుకుని మంచి ఆరోగ్యమైన ఆహారాని అందరిని అందించాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, వీఓఏ, సీసీలు కలిసి ఖరీఫ్ ప్రణాళిక చేయాలని, ఇందులో ఎలాంటి ఇబ్బంది ఉన్నా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, ఎన్ఎఫ్ఏ నరసింహారెడ్డి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం గురురాజు

భూసార పరీక్షలు తప్పని సరి

పెండ్లిమర్రి : రైతులు పంటలు సాగుకు ముందు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయాధికారి జి.పి. ఓబులేసు తెలిపారు. మండలంలోని పెండ్లిమర్రి గ్రామ పొలాల్లో గురువారం మట్టి నమూనా సేకరణ కార్యక్రమం నిర్వహించారు.మండలంలో ఇప్పటికి 324 మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు.

ఫ్లెక్సీలను తొలగించండని వినతి

పులివెందుల టౌన్ : పట్టణంలో రింగురోడ్డు చుట్టూ మతమార్పిడిని ప్రోత్సహిస్తున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, మార్క్ ఫైడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డిలు బీజేపీ నాయకులతో కలిసి గురువారం కమిషనర్ రాముడుకు ఆయన కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

గ్రంథాలయం తనిఖీ

కొండాపురం : స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా సెక్రటరీ అమీరుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠకులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కొండాపురం గ్రంథాల లైబ్రేరియన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు వేడుకలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో పెన్నానది ఒడ్డున వెలసిన హాజరత్ సయ్యద్ షా గూడుమస్తాన్‌వలీ ఉరుసు వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి నిషాన్‌తో ప్రారంభమైన వేడుకలు ఈనెల 27వ తేదీ జయారత్‌తో ముగియనున్నాయి. 25 గంధం, 26 ఉరుసు, 27 జయారత్ వేడుకలు జరుగనున్నాయి.

టపాసుల దుకాణం పరిశీలన

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరులోని టపాసుల దుకాణాన్ని గురువారం తహసీల్దారు సరస్వతి పరిశీలించారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని టపాసుల దుకాణ యజమానులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కౌశిక్, లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపక అధికారి బక్కిరెడ్డి, ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

వేంపల్లె : బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసుల సహకారంతో ఓ అనాథ శవానికి వేంపల్లెకు చెందిన యువకులు షేక్ రాహుల్, మదార్ షావలి, అఫ్జల్, వసీం, అర్షద్‌లు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే గురువారం సాయంత్రం స్థానిక జీవాల మార్కెట్‌లో ఓ గుర్తు తెలియని అనాథ వృద్ధుడు మృతి చెందారు. దీంతో ఆ యువకులు ముందుకొచ్చి పోలీసుల సహకారంతో స్థానిక బైపాస్ రోడ్డులోని బిస్మిల్లా మసీదు ఖబరస్తాన్‌లో అంత్యక్రియలు చేశారు. మృతి చెందిన వ్యక్తి బాబావలి(65)గా గుర్తించారు. బంధువులకు సమాచారమందించిన వారు ముందుకు రాలేదని, దీంతో ఆ యువకులు దగ్గరుండి అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు.

వైభవంగా పెద్దమ్మతల్లి దేవర

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ఎస్.ఉప్పలపాడులో పెద్దమ్మతల్లి దేవర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి మహోత్సవం ప్రారంభమైంది. గురువారం భక్తులు బోనాలు సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ చల్లని దొర తెలిపారు. మండలంలోని నందిమండలం గ్రామంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో రికార్డులు సక్రమంగా లేకుండా ఉన్న ఆరు ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెండ్లిమర్రి, వీయన్‌పల్లె ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఆలయంలో కోనేరును ప్రారంభించిన ఎంపీ



ఆలయ కోనేరు వద్ద జలహారతి ఇస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని అతి ప్రాచీనమైన శ్రీరంగనాథస్వామి దేవస్థానంలో నూతనంగా రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయ కోనేరును గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయనకు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఆలయ ఈఓ రమణలు వేద పండితులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కోనేరు వద్ద ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ఎంతో పురాతనమైన దేవాలయంలో కోనేటి కొరత ఉందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.65 లక్షల నిధులు మంజూరు చేయించి కోనేరును నిర్మించడం జరిగిందన్నారు. ఈ కోనేరు ఉండటంవల్ల శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు, స్వామివారి నూలు పూజోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, చక్రస్నానం వంటి పూజలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, అంకాలమ్మతల్లి దేవస్థాన చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, మహేశ్వర్ రెడ్డి, లక్ష్మీ భార్గవి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గురువారం ఎంపీపీ అరుణ అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం సాఫీగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీఓ జయభారతి మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీ తప్పనిసరిగా పీఎం ఎస్‌బీవై బీమా చేసుకుంటే ఉపాధి కూలీలకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే రూ.2 లక్షల వరకు ఆ కుటుంబానికి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, ఏవో శివమోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ వాసుదేవరెడ్డి, ఏపీఎం మంజునాథ్, ఎంఈఓ ఓబులేసు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



పులివెందులలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



ఎర్రగుంట్ల : ర్యాలీ నిర్వహిస్తున్న థర్మల్ పవర్ ప్రాజెక్టు కాలనీ వాసులు

పులివెందుల టౌన్ : జమ్ము కాశ్మీర్‌లోని పల్గాంలోని హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పులివెందులలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హిందు ఐక్య వేదిక, ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక పాత ఆర్టీసీ సర్కిల్ వద్ద నుండి పూల అంగళ్ల సర్కిల్ వరకు సాగింది. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ, కూటమి ప్రభుత్వం నాయకులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తులను పట్టుకుని నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. ఇందులో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఉగ్రవాదుల దాడికి నిరసన ర్యాలీ

సింహాద్రిపురం : కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా సింహాద్రిపురం మండలం బిదినంచర్ల గ్రామంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొవ్వొత్తులను చేతపట్టుకుని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : మండలంలోని రాయలసీమ థర్మల్ ప్రాజెక్టులోని కాలనీ వాసులు కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. గురువారం సాయంత్రం కాలనీ వాసులు కొవ్వత్తులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

జమ్మలమడుగులో..



జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో ప్రజలు ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గురువారం రాత్రి పలు వీధులలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం చనిపోయిన వారికి సంతాపం వ్యక్తంచేశారు.

శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థికి స్వీటు తినిపిస్తున్న కరస్పాండెంట్ కేశవులు

వేంపల్లె : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచినట్టు ఆ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. ఈ పరీక్ష ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా టి.అరవింద్‌రెడ్డి 591, జి.కుసుమశ్రీ 560, పి.శివ ప్రణవి 551, పి.గణేష్‌కుమార్‌రెడ్డి 515, వై.మునిఅశ్రిత 504 మార్కులు సాధించారు. గతంలో కూడా అనేక పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభను కనబరిచారన్నారు.

పదిలో విద్యార్థుల ప్రతిభ



డి.నిఖిత 596



కౌశిక్‌రెడ్డి 590

జమ్మలమడుగు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కులతో నాలుగవ ర్యాంకు డి.నికిత సాధించిందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాల కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మా పాఠశాల అత్యుత్తమ మార్కులు సాధించిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో నికిత 596, కౌశిక్‌రెడ్డి 590, ఎస్.సమీరా 588, శాంతిప్రియ 587, కె.వి.తపస్వినిరెడ్డి 586, నరసింహారావు 580 మార్కులు సాధించారన్నారు. 59 మంది విద్యార్థులకు 500 మార్కులు సాధించారు. కార్యక్రమంలో కరస్పాండెంటెంట్ బైరెడ్డి నిఖిలారెడ్డి, ఏఓ ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శిరీష, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థికి పుస్తకాన్ని అందిస్తున్న కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులోని స్వామి వివేకానంద హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో అత్యంత ప్రతిభను కనబరిచినట్టు ఆ పాఠశాల కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఎస్.వినయ్ 594 మార్కులు సాధించగా, జి రేవంత్‌రెడ్డి 592 మార్కులు సాధించారని, 500 మార్కులకుపైగా 20 మందికి పైగా విద్యార్థులు సాధించారన్నారు. పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

పదిలో విశ్వజ్యోతి ప్రభంజనం



జి.అమృత 595



చంద్రకాంత్‌రెడ్డి 592

జమ్మలమడుగు : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విశ్వజ్యోతి హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల కరస్పాండెంటెంట్ పి.మర్రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి. అమృత రాష్ట్రస్థాయిలో 595 సాధించగా, ఎస్.చంద్రకాంత్‌రెడ్డి 592, టి.నివేదిత 591, వై.లక్ష్మీశ్రీజ, ఎం. సుస్మితలకు 590 మార్కులు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పరిమళ, ప్రకాశ్‌రెడ్డి, ఆనందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గురుకిరన్, శ్రీనివాసరెడ్డి, కుబ్రా తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాలలో శ్రీవివేకానంద విద్యార్థిని ప్రతిభ



స్నేహలత

సింహాద్రిపురం : స్థానిక శ్రీవివేకానంద హైస్కూలులో పదవ తరగతి చదువుతున్న స్నేహలత 589 మార్కులు సాధించి మండలస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. విద్యార్థిని స్నేహలతను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి వంద శాతం ఫలితాలు సాధించారని ఎస్ఓ గురుదేవి తెలిపారు.

ఉషాకిరణ్ విద్యార్థుల అద్భుత ప్రతిభ



పది ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ బీఎస్ రమణారెడ్డి

వేంపల్లె : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వేంపల్లె ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి తెలిపారు. పూనేటి తేజేష్ 593 మార్కులు, గజ్జల హర్షిని 592 మార్కులు, పోలేపల్లి అనూష్ వర్ధన్ 591 మార్కులు, ఎ.వి.లోకేష్ 589 మార్కులు, కే.స్నేహిత 587మార్కులు, పి.కేశవానందు 584 మార్కులు, ఎ.బృంద 579, కె.ముఖేష్ కుమార్ 579, జి.విష్ణువర్ధన్ 578 మార్కులు సాధించి చక్కటి ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులు



ఎం.శ్రావన్‌కుమార్ 596



డి.వెంకటలాస్య 592



కె.లహితహసన్ 590

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) : మండలంలో ఉన్న 12 ప్రైవేటు పాఠశాలలో 312 మందికి 266 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పట్టణంలో ఉన్న శ్రీకృష్ణచైతన్య హైస్కూల్ విద్యార్థిని ఎం.శ్రావన్‌కుమార్ 596 మార్కులు సాధించి మండలం ప్రథమ స్థానంలో నిలించారు. ద్వితీయ స్థానంలో శ్రీవిజ్ఞాన్ విద్యానికేతన్ డి.వెంకట లాస్య 592, ఆర్టీపీపీ డీఏవీకు చెందిన వీ కీర్తన 592 తృతీయ, శ్రీ విజ్ఞాన్ విద్యానికేతన్ కె.లహితహసన్ 590, ఆర్టీపీపీ డీఏవీకు చెందిన ఎస్.ప్రసన్నబాలజీరెడ్డి 590లు నిలిచారు.